ప్రజాశక్తి

శనివారం 31 ఆగస్టు 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఏ విచారణకైనా సిద్ధమే..

- జనార్ధన్‌పైనా ఆర్‌బిఐకి ఫిర్యాదు
- మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



తాను ఇళ్లస్థలాల భూముల విషయం లో అవినీతికి పాల్పడ్డాననంటూ తనపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే జనార్ధన్, జనసేన నేతలు సిఎం చంద్రబాబును కోరడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారంనాడు ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఒంగోలు నగరంలో పేదల ఇళ్ల స్థలాల కోసం రైతుల నుంచి భూములు పారదర్శకంగా సేకరించామన్నారు. నేరుగా రైతుల ఖాతాల్లోకే డబ్బులు జమచేయడం జరిగిందన్నారు. తనపై తెలుగుదేశం, జనసేన నేతలు ▶ 2లో



బాపట్లలో వరినాట్లు వేస్తున్న కూలీలు

దంచి కొట్టిన వాన

- బాపట్ల జిల్లాలో 405 మి.మీ.ల వర్షపాతం నమోదు
- వ్యవసాయ పనులు ముమ్మరం

2లో ▲



మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధిద్దాం

- వ్యకాసం జాతీయ
- ప్రధాన కార్యదర్శి
- బి.వెంకట్

5లో ▲

ఏ విచారణకైనా సిద్ధమే..

(మొదటిపేజీ తరువాయి)

చేసే ఆరోపణలకు ఏ విచారణకైనా సిద్ధమేనన్నారు. ఎన్నికలకు ముందు కూడా తనపైనా, తన కుమారుడిపైనా అనేక రకాలుగా దుష్ప్రచారాలు చేశారన్నారు. వాటిపైనా విచారణ చేయించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కడైనా డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే ఎంతటికైనా సిద్ధమేనన్నారు. లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తనపై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కావాలనే ద్వితీయశ్రేణి నేతలతో ఫిర్యాదులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించకుండా బ్యాంకులపై ఒత్తిడి చేసి వన్‌టైమ్ సెటిల్‌మెంటు చేయించుకున్నాడని, దాన్ని ఎలా చేశారో? ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి చేశారో ఆర్‌బిఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. బ్యాంకులకు ఎగ్గొట్టి చివరికి ఏదోరకంగా సెటిల్‌మెంట్లు చేసుకున్న విషయం అందరికీ తెలుసనన్నారు. ఈ వ్యవహారంపై సిఎం చంద్రబాబుకూ లేఖ రాస్తానన్నారు. దామచర్లపైనా విచారణ జరిపించాలని కోరతామన్నారు.

చిన్న పరిశ్రమలతోనే పెద్ద మార్పు

బాపట్ల ఎంపీ తెన్నేటి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



చిన్న పరిశ్రమలే ఉపాధికి పట్టుగొమ్మలని, చిన్న పరిశ్రమలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుందని బాపట్ల ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా బాపట్ల ఎంపీ లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తన సామాజిక మధ్యమాల్లో నిరుద్యోగ యువతకు తన సందేశాన్ని అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రధాన సమస్యల్లో గ్రామీణ నిరుద్యోగం ఒకటి. ఈ నేపథ్యంలో గ్రామ శివారులో కాలుష్యానికి అవకాశం లేని వ్యవసాయాధారిత చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని, తద్వారా గ్రామాలలో ఉపాధి సమస్య లేకుండా చేయాలనే దిశగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అన్నారు. దీనివల్ల పల్లెల్లోని యువత, మహిళలకు స్థానికంగా ఉపాధి లభించటమే గాక పేదరిక నిర్మూలన కూడా జరుగుతుందనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. భారీ పరిశ్రమల కంటే చిన్న పరిశ్రమలే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వం త్వరలో ఒక నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలని, అందులో చిన్న పరిశ్రమలకు పెద్దపీట వేయాలనే దిశగా అడుగులు వేస్తోంది. పదివేలకు పైగా గ్రామాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, సమర్థవంతమైన, స్థిరమైన రాజకీయ పాలనా వ్యవస్థ, కష్టించి పనిచేసే మానవ వనరుల లభ్యత, మెరుగైన మౌలిక సదుపాయాలున్న రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో చిన్నతరహా పరిశ్రమలు(ఎస్ఎస్ఐ) పెద్ద సంఖ్యలో వస్తే.. వేగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని ముఖ్యమంత్రి బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు.

పరిటాల రవీంద్రకు నివాళి

ప్రజాశక్తి-దర్శి

దివంగత మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత కీర్తీ శేషులు పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా ఆయన సేవలు స్మరించుకుంటూ దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి నాయకుడు కత్తి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పరిటాల రవీంద్ర నిరంతరం పేదల పక్షాన నిలబడ్డారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్నారు. రాయలసీమలో రాక్షస పాలనకు చరమగీతం పాడిన మహానుభావుడు రవన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముప్పరాజు శ్రీను, సుబ్బయ్య, నాగయ్య, సుబ్బారావు, పరిటాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

బాపట్ల జిల్లాలో 405 మి.మీ.ల వర్షపాతం నమోదు ● వ్యవసాయ పనులు ముమ్మరం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వ్యవసాయానికి అవసరమైన సమయంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపాయి. జిల్లాలో శుక్రవారం 405 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. రేపల్లె మండలంలో అత్యధికంగా 40.5 మి.మీ.లు, కర్లపాలెం 35.8, వేమూరులో 26.2, కారంచేడు 24.4, పర్చూరు 24.2, నిజాంపట్నం 19.4, చీరాల, మార్టూరు 18.4 మి.మీ.ల మేర వర్షపాతం నమోదైంది. జిల్లాఅంతటా వర్షాలు పడ్డాయి. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడిస్తున్న నేపథ్యంలో రైతులు తమ వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. గత జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిశాయి గానీ ఆగష్టులో సక్రమంగా వర్షాలు కురవలేదు. జలాశయాలు కూడా నిండడంతో కొమ్మమూరు కాలువకు నీరు విడుదల చేశారు. జిల్లాలోని వేమూరు, రేపల్లే, బాపట్ల ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేశారు. కొందరు వెద పద్ధతిలో వరి సాగు చేయగా మరికొందరు వరినార్లు పోసి మాగాణి సాగు చేపట్టారు. ఆగష్టులో సాధారణ వర్షాలు కూడా పడకపోగా విపరీతమైన ఎండల కారణంగా రైతులు ఇబ్బందులు పడ్డారు. కొమ్మమూరు కాలువ చివరి భూములకు సాగునీరు అందక, వర్షాలు లేక భూములు బెట్టపోయాయి. వెద పద్ధతిలో సాగు చేసిన వరి పైరు ఎండుముఖం పట్టింది. బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో మెట్ట పంటల సాగు కూడా కష్టమయింది. వ్యవసాయ సీజన్ సమయంలో కాలువల ద్వారా వచ్చే నీటితో పాటు వర్షాలు పడుతూ ఉంటే వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుంది. పైర్లు కూడా కళకళలాడతాయి. కానీ ఈ నెల చివరిరోజుల వరకు సక్రమంగా వర్షాలు లేకపోగా పొడి వాతావరణం కారణంగా రైతులు వ్యవసాయ పనులు కూడా నిలిపివేసే పరిస్థితి తలెత్తింది. దీంతో ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,03,790 హెక్టార్లు అయితే ఇప్పటివరకు జిల్లాలో 40 వేల హెక్టార్ల వరకు వరి సాగు చేశారు. వివిధ రకాల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,41,916 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 50 వేల హెక్టార్లలో మాత్రమే పంటల సాగు జరిగింది. ఆరుతడి పంటలు వేసేందుకు కూడా రైతులు సందేహించారు. ఈ కారణంగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, శనగ, మిర్చి లాంటి పంటల సాగును కూడా రైతులు చేపట్టే ధైర్యం చేయలేకపోయారు. వరి పైరు సాగు పనులు కూడా నిలిచి పోయాయి. వర్షాలు కురవకపోతే కాలువల ద్వారా వచ్చే సాగునీరు సరిపోదన్న సందేహంతో రైతులు వ్యవసాయ పనులను పూర్తిస్థాయిలో చేపట్టిన పరిస్థితి లేకపోయింది. గత సీజన్‌లో కూడా మాగాణి, మెట్ట రైతులు వర్షాలు సక్రమంగా కురవక, కాలువల ద్వారా నీరందక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆది, సోమవారాల్లో కూడా జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ వర్షం వ్యవసాయానికి మేలు చేసేదిగానే ఉన్న నేపథ్యంలో జిల్లాలో మాగాణి, మెట్ట సాగు పనులకు రైతులు సమాయత్తమయ్యారు.

సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తాం: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఉద్యోగ విరమణ చేసిన వారితో జిల్లా ఎస్పీ తుషార్ డూడి

పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా బాపట్ల జిల్లాలో సర్వీసులో ఉంటూ వివిధ కారణాలతో మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులతో, పోలీసు శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం నుంచి ఇంకా రావల్సిన బకాయిలు, ఇతర రాయితీల గురించి సమీక్షించారు. ఒకొక్కరితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి రావలసిన భద్రత, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, చేయూత, విడో ఫండ్, కార్పస్ ఫండ్, అడిషినల్ కార్పస్ ఫండ్, గ్రూఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు వంటివి సకాలంలో అందింది లేనిది అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన చర్యలు చేపట్టాలని కార్యాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులకు, సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎవైనా సమస్యలు ఎదురైతే స్వయంగా తమకు తెలపవచ్చునన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, ఎవో బి శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, బిఅండ్‌పే సెక్షన్ సూపరింటెండెంట్ బి రాధ, ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా షావలి, డిపిఓలోని వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులు, మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనే అమలు చేస్తోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ విమర్శించారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్‌యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత వైసిపి హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు తక్కువగా ఉన్నారనే సాకుతో వాటిని మూసి వేయడానికి తీసుకువచ్చిన జీవో నెంబర్ 84, 85, 117లను రద్దు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు.



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రూ.20 వేలు లంచం తీసుకుంటూ..

ఏసీబీకి చిక్కిన విద్యుత్ లైన్‌మెన్

ప్రజాశక్తి-రాచర్ల

ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ.. ఎపిసిపిడిసిఎల్ లైన్‌మెన్ ఏసీబీ అధికారుల వలకు చిక్కారు. రాచర్ల మండలం, అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం విద్యుత్ లైన్‌మెన్ విసిహెచ్ రామలింగయ్యను సంప్రదించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం లైన్‌మెన్ రూ.25 వేలు లంచం డిమాండ్ చేశారు. అందుకు రైతు అంగీకరించారు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు అనుమలవీడు గ్రామం, ఎస్‌సి కాలనీ పక్కనే ఉన్న కిరణ్ పొలంలో విద్యుత్ లైన్‌మెన్ రామలింగయ్య రైతు కిరణ్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లైన్‌మెన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం లైన్‌మెన్‌ను ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ ఇన్స్‌పెక్టర్ శేషు, ఎస్సైలు జేబీఎన్ ప్రసాద్, షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీ అధికారులకు చిక్కిన విద్యుత్ లైన్ మ్యాన్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రామరాజు

బైకు దొంగలు అరెస్టు

- 23 వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-కనిగిరి

బైకు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.23 లక్షల విలువైన 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కనిగిరి డిఎస్‌పి రామరాజు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయి, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కనిగిరికి చెందిన కొండారెడ్డి, వినుకొండకు చెందిన నారాయణ జిల్లాలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వారిని ప్రత్యేకంగా విచారించగా కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి ఇచ్చిన సమాచారం మేరకు రూ.23 లక్షల విలువైన 28 మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. బైకు దొంగలను పట్టుకోవడంలో చొరవ చూపిన కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ త్యాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ శోభన్‌ను ఈ సందర్భంగా డిఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది వెంకట్రావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని కష్ణంశెట్టిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. .ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బుడతా మధుసూదన్, మాజీ ఎంపిటిసి పాలుగుళ్ల ప్రతాప్ రెడ్డి, ఎంఇఒలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజూరేఖ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కమ్మగొని వెంకట సుబ్బయ్య , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వందుట్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.... వందుట్ల గ్రామంలో సమీపంలో అధికారులు విద్యుత్ లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కట్ చేసిన విద్యుత్ తీగ కింద కింద పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న భూపని రమేష్ (23) అనే యువకుడి కాలికి విద్యుత్ తీగ ఓ వైపు తగింది. మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్‌కు తలిగింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైై రమేష్ అక్కడిక్కడే మృతిచెందాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు చనిపోయాడని మృతుడి తండ్రి భూపని వెంకటేశ్వర్లు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రమేష్

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పొన్నలూరు

భార్యా భర్తల మధ్య గొడవల కారణంగా మనస్తాపానికి గురైన భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దవెంకన్నపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పెద్దవెంకన్న పాలెంకు చెందిన తన్నీరు కొండలరావు (35) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల కొండలరావు చెడు వ్యసనాలకు బానిసై అయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటు చేసు కుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన కొండలరావు బావిలో దూకి ఆత్మహత్య చేసు కున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

భవిత కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి- కొత్తపట్నం

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు టిఎల్‌ఎం ద్వారా బోధన చేయాలని రాష్ట్ర సహాయక సహిత విద్యా సమన్వయకర్త మల్లికార్జున్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల పనితీరును శుక్రవారం పరిశీలించారు. తొలుత జాబ్ చాట్ లోని టైం టేబుల్ అనుసరిస్తున్నారా లేదా అని, రికార్డులు నిర్వహణ, సిడబ్ల్యుఎస్ పిల్లల సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే అలవెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ట్యాబులను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందరితో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను రెగ్యులర్ గా తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠ్యాంశాలను బోధించి నట్లయితే వారిలో వైకల్య లోపం అనే భావన కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త, సమగ్ర శిక్ష ఎఎంఒ ఎం. రమేష్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సాయి కిషోర్ ,స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బాలాజీ . ఉపాధ్యాకులు, భవత కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి కొమరోలు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని డ్రీమ్ రెస్టారెంట్ సమీపంలో కంభం- కడప జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో షేక్ బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.



అవగాహనా కల్పిస్తున్న డాక్టర్ మోహన్ రెడ్డి

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి - గిద్దలూరు

నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని రాజు పారా మెడికల్ కాలేజీ విద్యార్థినులకు నేత్రదానంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జికె. మోహన్ రెడ్డి మాట్లాడుతూ నేత్రదానం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఓ వ్యక్తి నేత్రదానం చేస్తే ఇద్దరికి కంటి చూపు ప్రసాదించవచ్చునని తెలిపారు. ఇప్పటికీ చాల మందికి నేత్రదానంపై పెద్దగా అవగాహన లేదన్నారు. జన్యులోపాల వల్ల కలిగే అంథత్వం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాలేజీ ప్రిన్సిపల్ కొండేటి రాజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి అంథత్వాన్ని రూపు మాపాలన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహాశీల్దారును కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు తహాశీల్దారు భాగ్యలక్ష్మిని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గజ్జలకొండ నారాయణ, జనసేన పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి. నారాయణ, నాగరాజు తలారి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ తెలిపారు. విజయవాడ తపాలా రీజియన్ ఆధ్వర్యంలో తపాలా సేవలపై స్థానిక జవహర్ ఆసుపత్రిలో కళాజాత బృందం శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ మాట్లాడుతూ తపాలా సేవలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రజల భాగస్వామ్యం పెరగాలన్నారు.ఈ సందర్భంగా కళాజాత బృందం ప్రదర్శించిన ప్రదర్శనలు ఆట కుట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీమకుర్తి సబ్ పోస్టుమాస్టర్ కాలే రామారావు, శివ, కళాజాత బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయురాలు గిరిజను సన్మానిస్తున్న అధికారులు

చందలూరు హైస్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - పంగులూరు

జిల్లాలో స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ 2024 అవార్డుకు చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఎంపిక కావటం ఎంతో సంతోషమని విద్యా కమిటీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ అన్నారు. ఈ ఎంపికకు కారకులైన పాఠశాల హెచ్ఎం చందలూరు గిరిజ, ఫిజికల్ డైరెక్టర్ కొండా ప్రతిమను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్ లెన్సీ అవార్డు కింద ఐదు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఎంపికైన పాఠశాలల్లో చందలూరు పాఠశాల ఉంది. ఇందుకుగాను ఈనెల 29న బాపట్లలోని గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డిఇఒ, డిఎస్డిఓ, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఆధ్వర్యంలో హెచ్ఎం చందలూరు గిరిజను, ఫిజికల్ డైరెక్టర్ కొండా ప్రతిమను ఘనంగా సన్మానించి మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. అవార్డు తీసుకువచ్చినందుకు గ్రామ పెద్దలు అభినందించారు.



వరద పరిస్థితిని సమీక్షిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీ నుండి 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని విడుదల చేయడంతో పరివాహక ప్రాంత లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మేక శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెదలంక గ్రామ కాకులు డొంక, ఓలేరు, పల్లిపాలెం గ్రామాల వద్ద కృష్ణా నది వరద పరిస్థితిని సమీక్షించారు. వరద ఉధృతి పెరిగితే లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అలాగే పరివాహక లంక గ్రామాల పంచాయతీ, రెవిన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శివరామ కృష్ణ, విఆర్ఒలు ఎం జకరయ్య, ఎన్ రాంబాబు ఉన్నారు.



సినీ స్వర్ణోత్సవాల కేక్ కట్ చేసిన టిడిపి నాయకులు

'బాలకృష్ణ' సినీ స్వర్ణోత్సవాలు

ప్రజాశక్తి - కొల్లూరు

సినీ నటులు, శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా స్థానిక ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్బులో నందమూరి బాలకృష్ణ అభిమానులు భారీ కేక్ కట్ చేసి శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదన్ ప్రసాద్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒపిఎస్ కోసం యుటిఎఫ్ నిరసన



అద్దంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - అద్దంకి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎన్డీఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిరసన తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు మాట్లాడుతూ ఉద్యోగులకు ఆమోదయోగంగా లేని యుపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్దించాలని సిపిఎస్, యుపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్దించే వరకు యుటిఎఫ్ పోరాటం చేస్తుందని అన్నారు. గత 20ఏళ్లుగా పోరాటాలు చేస్తూనే ఉన్నా రకరకాల ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటూ ఉద్యోగులను మోసం చేస్తూ ఉన్నారని అన్నారు. ఇకనైనా ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా ఓపిఎస్‌ను పునర్దించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ పునర్దించాలని, ఉద్యోగులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి బి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుని అన్నారు. ఏళ్ల తరబడి సేవలు చేసి ప్రజలకు తోడుగా ఉంటున్న ఉద్యోగులకు రిటైర్డ్ తర్వాత పెన్షన్ ఇవ్వటానికి అనేక రకాలైన సాకులు చెబుతూ పాత పెన్షన్ స్థానంలో అనేక రకాల విధానాలు తీసుకొని రావడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఎన్డీఎ ప్రభుత్వం తీసుకొని వచ్చిన యుపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. 2004 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు అనేక రకాలుగా పోరాటాలు చేస్తున్న కూడా ప్రభుత్వాలు సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ పేర్లతో మోసం చేస్తుండటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాహశీల్దారు తరపున ఆర్ఐ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ముండ్లమూరు మండల ప్రధాన కార్యదర్శి గోగుల కోటేశ్వరరావు, అద్దంకి మండల కోశాధికారి దామా రామాంజనేయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సర్వేశ్వరరావు, బివి రత్నం, సాంబశివరావు, జాషువ, మస్తాన్ వలి, బి పూర్ణచంద్రరావు, వి వెంకటేశ్వర్లు, వి ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపల్లె : కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన యూపిఎస్ పెన్షన్ స్కీమ్ వ్యతిరేకిస్తూ ఉద్యోగులు అందరికీ (పాతపెన్షన్) ఓపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ అధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారు ఎం శ్రీనువాసరావుకు వినతి పత్రం అందజేశారు. యుపిఎస్ పెంక్షన్ వద్దు, పాత పెంక్షనే అమలు చేయాలంటు నినాదాలు చేశారు. తహశీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ముందు నినాదాలతో నిరసన తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల హక్కు, బిక్షకాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. సిపిఎస్ పేరుతో గతంలో ఉద్యోగులు దాచుకున్న వాటినే పెన్షన్ ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగులకు ఏదో అదనంగా పెంన్షన్ ఇస్తున్నట్లు యుపిఎస్ పేరుతో మోసం చేయడానికి సిద్ధమైందని ఆరోపించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కోట్లాది మంది కార్మికుల హక్కు అయిన పెన్షన్ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంలో అనేక హామీలు ఇచ్చి పాత పెన్షన్ అమలు చేస్తామని మోసం చేస్తుంటే ఇప్పుడు కేంద్రంలో యుపిఎస్ పేరుతో రాష్ట్రాల మీద బలవంతంగా ఉద్యోగులకు నష్టం చేసే పెన్షన్ తీసుకురావడం కుట్ర పూరిత నిర్ణయమని అన్నారు. దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వి సుబ్బారావు, రాజభూషణం, రాజేష్, జి రవీంద్ర, రత్నబాబు, లక్ష్మణుడు, ఏలియా, వంగర శ్రీనివాసరావు, నాగరాజు, డి శ్రీనివాసరావు, రహేమతుల్లా, డివైఎఫ్ఐ, సిఐటియు కెవి లక్ష్మణరావు, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.



యుపిఎస్ రద్దు కోరుతూ ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. మార్టూరు అర్బన్ సర్కిల్ కార్యాలయాన్ని అయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. సర్కిల్ పరిధిలో జరుగుతున్న నేరాలను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలపై సీఐ మాదినేని శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి రోడ్డు భద్రతా నియామాలు, మోటారు వాహన చట్టాల గురించి ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో సిబ్బంది గస్తీ



మాట్లాడుతున్న ఎస్‌పి తుషార్ డూడి

సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. జాతీయ రహదారిపై డాబాలు, రెస్టారెంట్లు, హోటళ్ల ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. పోలీసు సిబ్బందికి శాఖ పరమైన సమస్యలు ఉంటె వాటిని తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడానికి వాహన తనికీలు విస్తృతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎఎస్ఐలు షేక్ సైదా, షేక్ బాషా, ఆంజనేయులు, కోటేశ్వ రరావు, రాజేష్, గరుత్మంతుడు, శివరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకొని శాస్త్రీయ పద్ధతుల్లో నేర దర్యాప్తు చేసి కేసులను త్వరిగతిన చేధించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేరసమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, ఇతర అంశాలతో పాటు డిపిఓలో వివిధ పెండింగ్ కేసులపై సమీక్షించారు. జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకొని సమన్వయంతో పనిచేసి ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని అన్నారు. వీలైనంత త్వరగా పెండింగ్ కేసుల పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. అరెస్టులు, చార్జ్ షీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్

నిర్దిష్ట సమయంలోపు బాధితులకు న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. స్టేషన్లలోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాల తనిఖీలు చేసి దొంగతనాలు కట్టడి చేయాలన్నారు. నేర నియంత్రణకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని అన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చేయాలన్నారు. స్థానిక ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పతి గ్రామ పరిధిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుని గొడవలు, అల్లర్లు జరిగేందుకు ఆస్కారం ఉన్న సమాచారాన్ని సేకరించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని అన్నారు. వాటికి అనుగుణంగా స్టేషన్ రికార్డ్స్ నిర్వహించుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి భాదితులకు న్యాయం చేకూరుస్తామనే భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఎఎస్‌పి (క్రైమ్) ఎస్‌వి శీధర్‌రావు, డిఎస్‌పిలు ఆర్ శ్రీనివాసరావు, రామరాజు, లక్ష్మి నారాయణ, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ సీఐ వి సూర్యనారాయణ, పోలీస్ లీగల్ అడ్వయిజర్ వేణుగోపాల్, సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో

రిజర్వేషన్లు సాధిద్దాం

- లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాలకులు ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తుండటంతో దళితులు, అణగారిన వర్గాలు, వ్యవసాయ కూలీల కుటుంబాలకు విద్య, ఉపాధి అందుబాటులో లేకుండా పోయిందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించటం నేడు అత్యంత అవసరం అయ్యిందన్నారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతున్న ఆ సంఘం రాష్ట్ర స్థాయి విస్తత సమావేశాలలో శుక్రవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి సమాధి కడుతున్న బిజెపి మతోన్మాద భావజాలాన్ని ప్రతిఘటించాలన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు విశాల ఐక్యవేదికలను ఏర్పాటుచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాలైన దళితుల సమస్యలు ఎజెండా చేసేందుకు సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు దేశవ్యాప్త క్యాంపెయిన్ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు పెట్టించాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న రెవెన్యూ సదస్సులలో భూమి సంబంధిత సమస్యలపై విస్తతంగా అర్జీలు పెట్టించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రజల భూ సమస్యలు పరిష్కారం దిశగా సదస్సులు ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలను సమీకరించి చేస్తున్న భూమి ఇళ్ల స్థలాల పోరాటాలకు సంబంధించిన అర్జీలు అధికారులు పరిష్కరించకపోతే సదస్సులోనే ప్రభుత్వం ప్రశ్నిస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను ఈ ప్రభుత్వం రద్దు చేసినా, కేంద్ర ప్రభుత్వం డొంక తిరుగుడు మార్గంలో అమలు చేయమని ఒత్తిడి తెస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం తలొగ్గుతుందా.? ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిలబడుతుందో తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు ఎందుకు ఆలోచిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి 16 రకాల నిత్యవసర వస్తువులన్ని చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలోని బంజరు భూములు, సాగుకు యోగ్యమైన భూములను అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి యం.హరిబాబు పాల్గొని ప్రసంగించారు. 26 జిల్లాలకు చెందిన ప్రతినిధులు చర్చించి కర్తవ్యం రూపొందించుకున్నారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర విస్తృత సమావేశాల నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



కరాటే టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ

ఆత్మరక్షణకు మార్షల్‌ఆర్ట్స్ దోహదం

కరాటే టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని, అటువంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఒంగోలు, మహాలక్ష్మి కళ్యాణమండపంలో జరగనున్న సిద్ధార్ధ అకాడమీ ఇంటర్ స్టేట్స్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను నగర ప్రముఖులతో కలిసి ఒంగోలు నిర్మల్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సిద్ధార్థ కరాటే అకాడమీ నిర్వాహకులు నల్లూరి మోహన్‌రావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీ జరిగే ఇంటర్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో కర్ణాటక, మహారాష్ట్ర తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నుండి సుమారు 600 మంది కరాటే విద్యార్థులు హాజరవటం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, దుగ్గినేని వెంకట్రావు, మండవ సుందర్ సాయి, నంబూరి శ్రీరాములు పాల్గొన్నారు.

రూ.5 వేల కోట్ల వ్యాపారమే లక్ష్యం

- సొసైటీ ఛైర్మన్ పిఆర్‌విపిఎస్ రాజు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ 2026 సెప్టెంబర్ నాటికి రూ.5 వేల కోట్ల వ్యాపారం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు సొసైటీ ఛైర్మన్ పిఆర్‌విపిఎస్ రాజు తెలిపారు. స్థానిక హోటల్ మౌర్య ఇన్‌లో ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఒంగోలు బ్రాంచ్ సభ్యుల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ కెవి.సుబ్బయ్య పాల్గొన్నారు. సొసైటీ ఛైర్మన్ రాజు మాట్లాడుతూ ఖాతాదారుల నమ్మకంతో సొసైటీ దినదినాభివృద్ధి చెందుతుందని, 42 బ్రాంచ్‌లలో 96,000 మంది సభ్యులు నమోదయ్యారన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కెవి సుబ్బయ్య మాట్లాడుతూ ఒంగోలు బ్రాంచి వ్యాపారం 29 కోట్లను అధిగమించిందన్నారు. సమావేశంలో మేనేజర్ కె.ఆంజనేయులు, ఖాతాదారులు నెప్పల సుబ్బరామయ్య, ఆంజనేయులు, బదరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, అధికారులు

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ప్రజల ఆరోగ్యం పట్ల చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డివి లలిత కుమారి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వర్షాల సీజన్ కావడంతో మురుగు నీటి నిల్వలపై ఎబేట్ ద్రావణం పిచికారి చేయించాలని సూచించారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలని చెప్పారు. గత ప్రభుత్వం 15 పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు సరఫరా చేసినప్పటికీ కొన్ని పంచాయతీల్లో మిషన్లు లేకపోవడం, మరికొన్ని మిషన్లు పాడైపోవడంపై పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వర్షాల సీజన్లో ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా 25సార్లు ఫీవర్ సర్వే నిర్వహించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచించి ఎఎన్ఎంల ద్వారా ప్రత్యేకంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తే బాగుంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు తీసుకున్న చర్యలు, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో జెడ్పిటిసి టీ ఉదయ భాస్కరి, ఎంపిడిఒ జి చంద్రశేఖరరావు, పిఒపిఆర్డి టి ఊహారాణి, భట్టిప్రోలు, వెల్లటూరు పిహెచ్‌సి డాక్టర్లు డిఎల్ పద్మజ, సిహెచ్ రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ ఆర్ జనార్ధన్ తెలిపారు. మండలంలో 7159 పింఛన్లకు రూ.3.04కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం కావడంతో ముందుగానే 31న పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. సచివాలయ సిబ్బందికి శుక్రవారం నగదు అందజేయనున్నట్లు చెప్పారు.

సంతమాగులూరు : ఈనెల 31న శనివారం ఉదయం ఐదు గంటలకు పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపిడిఒ శివరామకృష్ణ ప్రసాద్ తెలిపారు. సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

వేమూరు : ప్రభుత్వం పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు వివిధ గ్రామాల్లో పాల్గొంటున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. కొల్లూరు మండలం దోనేపూడి ఎస్సీ కాలనీలో, భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఎస్టి కాలనీలో పెన్షన్ పంపిణీలో పాల్గొననున్నట్లు తెలిపారు. పెన్షన్ పంపిణీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నిజాంపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1న ఆదివారం కావడంతో ఈ నెల 31న పింఛను సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు తగ్గట్లుగా నగదును సిద్ధం చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు. ఎవరైనా 31న పింఛను తీసుకోకపోతే సెప్టెంబర్ 2న ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : నగరంలో శనివారం జరిగే పెన్షన్ల పంపిణీలో నాయకులు సచివాలయ సిబ్బందితో కలసి పాల్గొనాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు కోరారు. ముఖ్యమంత్రి పెన్షన్ల పంపిణీ ఒక రోజు ముందుగా చేపడుతున్నారన్నారు. వివిధ స్థాయి పదవుల్లో ఉన్న నాయకులు ఆయా సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెన్షన్ల పంపిణీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న చీరాల కమిషనర్ చక్రవర్తి, ఆర్డీఒ



పర్చూరు గురుకుల పాఠశాల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం



మేదరమెట్లలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ ప్రసన్న కుమారి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త వనమహోత్సవంలో భాగంగా తిమ్మాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆర్ దేవసేన కుమారి మాట్లాడుతూ మొక్కలు మన నేస్తాలని అన్నారు. మనం వేసే మొక్కలను సంరక్షించే బాధ్యత వేసిన వారు తీసుకోవాలని అన్నారు. అలాంటప్పుడే హరిత ఆంధ్ర ప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు. అటవీ శాఖ బీటు ఆఫీసర్ కె రమేష్ మాట్లాడుతూ వృక్ష సంపద దేశ సంపదని, ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే మొక్కలపై అభిరుచి ఏర్పర్చుకోవాలని అన్నారు. ప్రభుత్వ నర్సరీలో మొక్కలు కావలసిన వారు డిఎఫ్ఓ పేరు మీద మొక్క రూ.8 లెక్కన మొక్కలు డిడి తీసి ఇస్తే ఎవరికైనా అందజేస్తామని అన్నారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, ప్రోగ్రాం ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి నివారణకు వృక్ష సంపద ప్రధానమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే సరైన టైంలో వర్షాలతో సాగునీరు, త్రాగు నీరు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. ఆనందంగా జీవించవచ్చని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజానకు మూలమని అన్నారు. ఒక వృక్షం వెయ్యి మందికి ప్రాణవాయువు అందిస్తుందని అన్నారు. మానవ మనుగడే మన సంకల్పమైతే పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. మన పక్కనే ఉన్న జీవనది గుండ్లకమ్మను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, అధికారుల మీద ఉన్నదని అన్నారు. మానవహారంగా ఏర్పడిన విద్యార్థుల చేత వనమహోత్సవం ప్రతిజ్ఞ పిడి కె సుబ్బారావు చేయించారు. హై స్కూల్ ఆవరణలో వంద మొక్కలు నాటి అక్కడికి వచ్చిన పేరెంట్స్, ఇతరులకు వంద మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్, విద్యా కమిటీ చైర్మన్ గండు వెంకటరావు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ అద్దేటి శ్రీనివాసరావు, పరిటాల పవన్, పరిటాల రాఘవరావు, తోకల శ్రీనివాసరావు, రాఘవరావు, పరిటాల శ్రీను, అల్లంనేని కాశయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హరికృష్ణ, ఎ శ్రీనివాసరావు, ప్రదీప్, కొండలు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ముందుగా వనం మనంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామనే నినాదంతో మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ శివరామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి పూర్ణచంద్రరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఛమండలంలోని కుందుర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. తల్లి అంటే ప్రతి ఒక్కరికి అమితమైన ప్రేమ ఉంటుంది కాబట్టి నాటిన మొక్కలను విద్యార్థులు జాగ్రత్తగా పెంచాలని సిడిపిఓ డి సుధ తెలిపారు. తద్వారా పర్యావరణ మెరుగుపడుతుందని అన్నారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ ప్రమీల, అంగన్‌వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో మొక్కలు నాటుతున్న అధికారులు

ముండ్లమూరు : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని ఎంపిడిఒ రావూరి జనార్దన్ అన్నారు. వనం మనం కార్యక్రమాల భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడ చెట్లతో ఆధారపడి ఉందని అన్నారు. చెట్లను నరికి వేయడం వల్ల అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. వాతావరణ సమతుల్యతను కాపాడడానికి చెట్లు పెంచడం ఎంతో అవసరమని అన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ భారతి, ఎపిఒ నాగరాజు, ఎపిఎం హనుమంతరావు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లె : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ అన్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో పట్టణంలోని 25వ వార్డులోని చిన్న మసీదు వద్ద మొక్కలు నాటే కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కట్ట మంగ మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కమిషనర్ శేషాద్రి తెలిపారు. కార్యక్రమంలో గూడపాటి శ్రీనివాసరావు, మునిసిపల్ వైస్ చైర్మన్ కాశీ విశ్వనాథ గుప్తా, డిఈఈ శివరామకృష్ణ, ఎఈ రోహిణి, ఆర్ఐ వై ప్రసాద్, కౌన్సిలర్ షేక్ అప్సనా జమీర్, శానిటేషన్ ఇన్చార్జి అధికారి సురేంద్ర కుమార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల్లో వనం మనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల్లో కడియం నుండి తెప్పించిన వివిధ రకాల 40 మొక్కలను నాటారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఆఫ్ రెసిడెన్సి శివరామ్, ప్రిన్సిపాల్ విశ్వరాణి, ఈఒఆర్డి రామకృష్ణ, ఎపిఒ బులియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొల్లూరులో మొక్కలు నాటుతున్న నాగరాజుకుమారి

కొల్లూరు : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని ఆవులవారిపాలెం అంగన్‌వాడి కేంద్రం ఐసిడిఎస్ సూపర్వైజర్ పి నాగరాజుకుమారి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అనంతవరం సెక్టర్ 21 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : వనం మనం కార్యక్రమంలో భాగంగా కోరిసపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి చెట్లను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్ బాబు, టిడిపి మండల కన్వీనర్ జాగర్లమూడి జయకృష్ణ, జెడ్పిటిసి తుళ్లూరి వెంకటరమణ, కార్యదర్శులు డి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

చీరాల : మొక్కల పెంపకంలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని, కాలుష్య నివారణ సాధ్యమవుతుందని మునిసిపల్ కమిషనర్ కె చక్రవర్తి, ఆర్డిఓ సూర్యనారాయణరెడ్డి అన్నారు. నగరవనంలో శుక్రవారం జరిగిన వన మహోత్సవంకు హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో వాతావరణం కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ప్రజలందరూ బాధ్యతతో మొక్కలు పెంపకం నిర్వహించాలని కోరారు. మొక్కలను సంరక్షించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరావు, వేటపాలెం సెక్షన్ అధికారి వై జాన్సన్, కె రాఘవమ్మ, ఎఫ్‌బిఒ ఎస్ నాగమణి, ఫక్రున్నీసా పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సంతమాగులూరు ఎంపీపీ వై ఎలమంద



మొక్కలు నాటుతున్న రేపల్లె చైర్మన్ కట్ట మంగ



కుందుర్రులో మొక్క నాటుతున్న దృశ్యం

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - ఇంకొల్లు

వినాయక చవితి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాల మండపాలు ఏర్పాటు చేసే కమిటీ బాధ్యతగా ప్రభుత్వ, చట్టపరంగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ వైవి రమణయ్య తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు సింగిల్విండో యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండపాల నిర్వహకులు ఆ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. నిర్వాహకుని ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, పాస్పోర్ట్ ఫోటోతో యాప్‌లో నెట్ సెంటర్ ద్వారా కానీ, లేక స్వయంగా కంప్యూటర్లో కానీ, లేక సెల్ ఫోన్లో అయిన నమోదు కావచ్చని తెలిపారు.

వెంకటేశ్వర కల్యాణంలో అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కళ్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవ వేడుక కన్నుల పండుగగా శుక్రవారం నిర్వహించారు. బ్రహ్మశ్రీ పవన్ శర్మ ఆధ్వర్యంలో మహోత్సవం జరిగింది. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఉత్సవం అనంతరం అన్నదానం చేశారు.

త్వరలో బాలినేని అవినీతిపై విచారణ

- సానుకూలంగా స్పందించిన సిఎం చంద్రబాబు
- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే వదిలేది లేదు
- 2న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు
- ప్రెస్‌మీట్‌లో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ వెల్లడి



మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అవినీతిపై త్వరలో విచారణ జరుగుతుందని జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పేర్కొన్నారు. జనసేన జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హైదరాబాద్‌లో బాలినేని ప్రెస్‌మీట్‌లో తనపై అవినీతి ఆరోపణలపై విచారణ చేసుకోవచ్చుని చెప్పారన్నారు. బాలినేని కోరిక మేరకు ఆయన అవినీతిపై సాక్ష్యాధారాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించామన్నారు. దీంతో బాలినేనిపై విచారణకు సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. బాలినేని పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో జింక్ ఫిక్స్ ఐరన్ ఓర్ కంపెనీకి ఇచ్చిన యరజర్ల కొండను అన్ని తెలిసి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కొండను చదును పేరుతో రూ.40కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. రూ.65కోట్ల విలువైన యరజర్ల కొండ మట్టిని తన వియ్యంకుడి శ్రీకరి ఎంపైర్‌కి తరలించ లేదాని ప్రశ్నించారు. కేవలం యరజర్ల కొండ మట్టి తరలింపు పై రూ.100కోట్లు అవినీతి జరిగిందన్నారు. శ్రీకరి విల్లాస్‌లోని మట్టి నమూనాలు ల్యాబ్‌కు తరలించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఒంగోలు నగర పరిధిలోని 25వేల మంది పేదలకు చీరతో సహా పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చిన బాలినేని ఒంగోలులో 24వేల మందికి పట్టాలిచ్చారన్నారు. వీటిలో 12వేల మందికి ఇచ్చిన పట్టాలు ఈపాటికే ఆస్తులు ఉన్న వారికే ఇచ్చారన్నారు. నగరంలో వారి పేరుతో ఆస్తి పన్నులు కడుతున్నారన్నారు. ఇప్పటికే 500మందికిపైగా పేర్లను ముఖ్యమంత్రికి అందించామని తెలిపారు. మిగిలిన వారి పేర్లు కూడా త్వరలో అందిస్తామన్నారు. ఇల్లు లేని పేదవారికి ఇవ్వవలసిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ విషయంలో బాలినేని అధికార దుర్వినియోగంకు పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఒంగోలులో భూ కబ్జాల్లో బాలినేని తన హస్తం లేదని నిరూపించుకోవాలన్నారు. మంగమూరు రోడ్డులోని బ్రాహ్మణుల భూ కబ్జా విషయంలో సిఐడి విచారణలో బాలినేని, అతని తనయుడు పేర్లు స్పష్టంగా ఉన్నట్లు ఫైళ్ళు తెరిస్తే తెలుస్తుందన్నారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రావలసిన పారిశుధ్య ఉద్యోగాలను వైసిపి నాయకులు ఇళ్లల్లో పనిచేసే వారికి, నాయకుల స్నేహితుల కారు డ్రైవర్ల పేరుతో జీతాలు తీసుకుంటున్నారన్నారు. దాదాపు ప్రతి నెల రూ.25 నుండి రూ.30 లక్షల జీతాలు పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటిపై బాలినేని శ్రీనివాసరెడ్డి అడిగిన మేరకు విచారణ వేయిస్తున్నామని, ఇది రాజకీయ కక్ష సాధింపు కాదన్నారు. బాలినేని జనసేనలోకి వస్తున్న విషయం తన దృష్టిలో లేదని, అదంతా పార్టీ అధిష్టానం చూసుకుంటుందన్నారు. పార్టీలోకి వచ్చినంత మాత్రాన బాలినేనిపై అవినీతి పోరాటం ఆగదన్నారు.

2న డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 1న ఆదివారం ఒంగోలులోని గద్దల కుంట వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమం చేపడతామన్నారు. 2న రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, పార్టీ సభ్యత్వం ఎక్కువగా చేసిన నాయకులకు సన్మానం, కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద డొక్కా సీతమ్మ పేరుతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జనసేన జిల్లా కార్యదర్శి చనపతి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, జిల్లా కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల పాల్గొన్నారు.



పరిటాల రవికి నివాళులర్పిస్తున్న పరిటాల యువసేన

పరిటాల ఆశయాల కోసం పనిచేస్తాం

ప్రజాశక్తి - రేపల్లె

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా పరిటాల యువసేన ఆధ్వర్యంలో పరిటాల జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రేపల్లె నుండి నల్లూరిపాలెం వరకు వెళ్లి పరిటాల రవీంద్ర విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి పరిటాల యువసేన అధ్యక్షులు దండమూడి ధరణి కుమార్ ఘనంగా నివాళి అర్పించారు. నల్లూరిపాలెం గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పరిటాల యువసేన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం దండమూడి ధరణి కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాయలసీమ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ప్రజా నాయకుడు అన్నారు. తేజ్ కుమార్, పాపారావు, అగస్య, రామారావు, కళ్యాణ్, మురళి, సురేష్, పవన్, సతీష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చీరాల

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా సెప్టెంబర్ 03న వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. ఈ జాబ్ మేళాకు కళ్లామ్ టెక్సటైల్స్, గోదావరి కోపరేటివి సొసైటీ, టీవీఎస్ సుందరం ఫాసటేనర్స్, రాయల్ మెరైన్, రిలాయిన్స్ ట్రెండ్స్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 120కిపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతను బట్టి రూ.10 వేల నుండి రూ.20వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్‌ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, డిప్లొమా, బిఎస్సి (కెమిస్ట్రీ), ఎంఎస్సి (కెమిస్ట్రీ), ఎంబిఎ, పిజి విభాగాల వరకు చదువుకున్న 18 నుండి 35ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్ నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. సెప్టెంబర్ 3న ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 79814 43777, 63027 64962 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హిందూ శ్మశానవాటికలో చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పావులూరు రోడ్డులోని హిందూస్మశాన వాటికలో గత మూడు దశాబ్దాలుగా పెంచిన వేప, రావి, నేరేడు వంటి చెట్లను నాలుగు రోజుల క్రితం పచ్చికట్టె కొనుగోలు చేసే వారికి రూ.37వేలకు అమ్మరు. మూడు దశాబ్దాల క్రితం బహిర్భూమితో పిచ్చి చెట్లతో పాడుబడిన స్మశాన వాటికను అప్పట్లో రావి సుబ్బారావు అనే గ్రామ పెద్ద గ్రామస్తుల సహాయంతో విరాళాలు సేకరించి స్మశానానికి చుట్టూ తీగ, మంచినీటి బావి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజ్యసభ సభ్యునిగా ఉన్న కాలంలో ప్రభుత్వ నిధులతో ఒక సిసి షెడ్ నిర్మాణం చేపట్టారు. అనంతరం స్మశానంలో సగం వైపు పచ్చదనం చేసేందుకు వేప, రావి, మునగ, నేరేడు చెట్లతోపాటు పూల మొక్కలతో పాటు కొబ్బరి మొక్కలు కూడా నాటి వాటిని ప్రతినిత్యం జాగృతి చేస్తూ నీటిని పెడుతూ పోషకాలు అందిస్తూ పెంచి పెద్ద చేశాడు. స్మశాన వాటికలో సగం బాగానే పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేటట్లు తయారు చేశాడు. స్మశాన వాటికను అభివృద్ధి చేసిన అనంతరం గ్రామంలో అంతర్గత విబేధాలుతో అతనికి అస్మశానం బాధ్యతలను కొందరు తప్పించారు. అనంతరం దాదాపు ఆరేళ్ల క్రితం ఒక విడత పచ్చి కట్టెలుగా కొన్ని చెట్లను రూ.16వేల వరకు అప్పట్లో అమ్మారు. మళ్లీ ఇటీవల నాలుగు రోజుల క్రితం మిగిలిన చెట్లన్నీ శుభ్రంగా పచ్చి కట్టే వారికి అమ్మి జెసిబితో మొదళ్లు సైతం పీకించారు. ఈ విషయమై చెట్లు పీకించిన ఎన్ శ్రీనివాసరావును వివరణ అడుగగా స్మశాన వాటికకు మూడు వైపులా ఉన్న కంచ దెబ్బతిన్నదని, వాటి స్థానంలో చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్ట నున్నట్లు తెలిపారు. గ్రామానికి సంబంధించిన గ్రామ దేవత ఇంకొల్లమ్మ ఆలయం ఆవరణలోని గదులకు అద్దె వసూలు డబ్బులు ఉన్నవని, దాదాపు రూ.6లక్షలపైన ఉన్నట్లు తెలిపారు. ఆ నిధులతో చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం వనం మనం అంటూ మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్న సమయంలో కనీసం 30ఏళ్లలో స్మశానంలో ఒక్క మొక్క కూడా పెంచని పెద్దలు ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణానికి ఆటంకం లేని మధ్యలో ఉన్న చెట్లు కూడా తొలగించటంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



చెట్లు మొదలు పీకిన దృశ్యం

మినుముకు ప్రాణం పోసిన వర్షం

ప్రజాశక్తి - పంగులూరు

గత కొద్ది రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి శుక్రవారం కురిసిన వర్షం ఆనందాన్ని కలిగించింది. ఈ వర్షంతో బెట్టకు వస్తున్న మినుము పైరు ఒకసారిగా ప్రాణం పోసుకుందని రైతులు చెబుతున్నారు. మండలంలో 2600 ఎకరాల్లో రైతులు మినుము పైరును సాగు చేశారు. విత్తనాలు ఎద పెట్టేటప్పుడు భూమి పదునుగా ఉండటంతో విత్తనాలు వెంటనే మొలిచాయి. సుమారు 40 రోజుల క్రితం రైతులు విత్తనాలను ఎద పెట్టారు. పైరు పెరిగే దశలో ఉంది. వర్షాలు లేకపోవడంతో మినుము పైరు బెట్టకు వచ్చి పైరు ఎండిపోయే పరిస్థితులు కనిపించాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు వ్యవసాయంతో కలుపుకొని రూ.10 వేల ఉండి రూ.12వేల వరకు పెట్టుబడి పెట్టామని, మరో రెండు నెలల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు లేకపోవడంతో పైర్లు దెబ్బతినే పరిస్థితి వచ్చిందని రైతులు ఆందోళన పడ్డారు. వర్షం ఎప్పుడు వస్తుందాని ఎదురు చూడ సాగారు. ఈ పరిస్థితుల్లో అల్పపీడనం కారణంగా గురువారం అర్ధరాత్రి నుండే వర్షం మొదలైంది. శుక్రవారం ఉదయానికి కొంత వర్షం పేరిగి పైరుకు ఉపయోగపడే విధంగా కురిసిందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం వలన ఎండిపోయే దశకు వచ్చిన మినుము పైరు ప్రాణం పోసుకొని, మరల పచ్చబడే అవకాశం ఉందని, ఈ వర్షం మినుము పైరుకు ప్రాణం పోసిందని రైతులు ఆనందంగా చెప్పారు.



మినుము పైరు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ రవిశంకర్

విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

నేషనల్ కెరీర్ సర్వీసెస్ పోర్టల్ నందు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవటం ద్వారా లబ్ధి పొందవచ్చని విజయవాడ దత్తో పంత్ ఠేంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ ప్రాంతీయ సంచాలకులు ఆర్ రవిశంకర్ అన్నారు. మండలంలోని ఈపూరిపాలెం ఐటిఐ కళాశాల్లో వివిధ ప్రభుత్వం పదకాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నందలి ఒక విభాగమైన దత్తోపత్ ఠేంగడి ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెబిఎన్‌ఎంఐటిఐ నందు ఆయన మాట్లాడారు. సదస్సుకు సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డి మతీన్ అధ్యక్షత వహించగా ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్‌ఎ సత్తార్, ఇంఛార్జి కెవిపి శేషయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



బస్టాండు ఆవరణలో ఆర్టీ కార్మికుల నిరసన

ఆర్టీసీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయుఎ ట్రాఫిక్, గ్యారేజ్ కమిటీ ఆధ్వర్యంలో నైట్ అవుట్ అలవెన్సులు కలపడంలో ట్రెజరరీ అధికారుల వైఖరి నిరసనగా గేట్ మీటింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎన్ఎంయుఎ నాయకులు మాట్లాడుతూ సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని అన్నారు. రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, రమణారెడ్డి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన కరువైందన్నారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియ ఖర్చులకు రూ.25వేలు పెంచాలన్నారు. మెడికల్ రీయంబర్స్ మెంట్ బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న జెడి హనుమంతరావు

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రైతులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం హనుమంతరావు అన్నారు. గొరిగిపూడిలో శుక్రవారం ఎఫ్‌పిటిపై శిక్షణ నాబార్డు సహకారంతో నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎలాంటి ప్రభుత్వ పథకాలు పొందాలంటే లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగ చేసుకోవాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలకు ప్రతి పథకం ఎఫ్‌పిఓ ద్వారా అమలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్డీఎం శివకృష్ణ, నాబార్డు డిడి ఎం రవికుమార్, డిడి పద్మావతి, చర్చ్ సమస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం జరిగిన వన మహెూత్సవ కార్యక్రమంలో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో సామాజిక వనం డిఎఫ్ఓ సునీత, ఒంగోలు ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, కనిగిరి అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసరావు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అబ్దుల్ హాఫీజ్, 19వ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు.

వన మహోత్సవంలో జేసీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

మొక్కలు నాటిన ఒంగోలు మేయర్

వన మహెూత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఒంగోలు నగరంలోని భాగ్యనగర్‌లో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.